ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

'బాపట్ల'కు 4 పదవులు

- బావుడా ఛైర్మన్‌గా సలగల రాజశేఖర్
- ఏపీ హ్యాండ్లూమ్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా హేమలత
- ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా విజయ్‌కుమార్
- ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పాపారావు



హేమలత



రాజశేఖర్



విజయ్‌కుమార్



పాపారావు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా


రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో బాపట్ల జిల్లాకు నాలుగు ఛైర్మన్ పదవులు వరించాయి. రెండు పదవులు టిడిపికి.. మరో రెండు పదవులు జనసేనకు దక్కాయి. బావుడా ఛైర్మన్‌గా సలగల రాజశేఖర్, ఏపీ హ్యాండ్లూమ్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా హేమలత, ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా విజయ్‌కుమార్, ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పాపారావు ఎంపికయ్యారు.

చీరాలకు చెందిన డాక్టర్ సజ్జా హేమలత ఏపీ హ్యాండ్లూమ్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. చీరాల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సజ్జా చంద్రమౌళి కోడలయిన హేమలత గతంలో పలు పర్యాయాలు చీరాల టిడిపి టిక్కెట్ ఆశించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా టిడిపి టికెట్ ఆశించినప్పటికీ రాలేదు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.మాలకొండయ్య విజయానికి తన వంతు కృషి చేశారు. ఈ నేపథ్యంలోనే పలువురు నేతల సిఫార్సు మేరకు హేమలతకు ఈ పదవి దక్కినట్లు తెలుస్తోంది.

బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (బావుడా) ఛైర్మన్‌గా సలగల రాజశేఖర్‌బాబు నియమించబడ్డారు. తెలుగుదేశం ▶ 2లో

నామినేటెడ్ పదవుల పందేరం

- రాష్ట్రస్థాయిలో పార్టీకి సేవ చేసిన కొందరికి పదవులు
- జిల్లాలో అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన నేతలకు మొండిచేయి
- పెండింగ్‌లో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నామినేటెడ్ పదవుల పందేరం జరిగింది. రెండో జాబితాలోనూ జిల్లా నేతలకు నిరాశే మిగిలింది. మొదటిసారి జిల్లాలో ఇద్దరు కీలక నేతలకు పదవులు దక్కాయి. రెండో జాబితాలోనే అంతా నిరాశే మిగిలింది. ముగ్గురికి పదవులు ఇచ్చినట్లే కనిపించినా ఇక్కడ అభ్యర్థుల వెంట ఉండి వారి గెలుపు కోసం కృషి చేసిన వారికి అవకాశం రాలేదు. రాష్ట్ర స్థాయిలో పార్టీకి సేవలందించిన ముగ్గురు జిల్లాకు చెందిన నేతలకు పదవులు దక్కాయి. ఇప్పటివరకూ పదవుల కోసం ఎదురుచూశారు. నేతలపై ఆశలు పెట్టుకున్నారు. వివిధ రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు ఛైర్మన్లను శనివారంనాడు ప్రకటించారు.

కులాలు, పార్టీల వారీగా వడపోతల అనంతరం జాబితాను విడుదల చేశారు. ఇంకా కొన్ని పెండింగ్‌లోనే పెట్టారు. ఎవరిని ఎంపిక చేయాలి? ఏ పార్టీకి ఇవ్వాలనే దానిపైనే సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో జిల్లాకు చెందిన ముగ్గురికి పదవులు దక్కాయి. అయితే వీరెవరూ జిల్లాలో అభ్యర్థుల గెలుపు కోసం ఇక్కడ నిత్యం ఉంటూ కృషి చేయలేదు. రాష్ట్రస్థాయిలో పార్టీ అప్పగించిన బాధ్యతల్లో తమ శక్తి మేరకు పనిచేశారు. అలాంటివారిలో జిల్లాకు చెందిన ముగ్గురికి పదవులు దక్కాయి. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మర్రెడ్డి శ్రీనివాసరెడ్డికి ఏపి స్టేట్ అగ్రికల్చర్ కమిషన్ ఛైర్మన్‌గా ఇచ్చారు. ఆయన దర్శి నియోజకవర్గానికి చెందిన నేత. రాష్ట్రస్థాయిలోనే ఆయన బాధ్యతల్లో ఉన్నారు. ఏపి ఫైబర్ నెట్‌వర్క్ లిమిటెడ్ ఛైర్మన్‌గా జివి.రెడ్డిని ఎంపిక చేశారు. ఈయన మార్కాపురం ప్రాంతానికి చెందిన నేత. టీవీల్లో పార్టీ తరపున చర్చావేదికల్లో పాల్గొని పార్టీ వాణిని వినిపించారు. అందుకు ఆయనకు ఈ పదవి ఇచ్చారు. ఈయన కూడా నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాల్లో అంతగా లేరు. ఇక ఏపీ కల్చరల్ కమిషన్‌గా ఒంగోలుకు చెందిన పొడపాటి తేజస్వి ఎంపికయ్యారు. ఈమె కూడా పార్టీ రాష్ట్ర కేంద్రంలోనే ఉన్నారు. నియోజకవర్గాల్లో ఎన్నికలకు ముందు అభ్యర్థులతో ఐటి విభాగం తరపున వేదికలు నిర్వహించారు. చదువుకున్న యువతలో పార్టీ పట్ల సానుకూలత కల్పించే కార్యక్రమాలు తేజస్విని చురుగ్గా నిర్వహించారు. పార్టీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉన్నారు. పార్టీ వేదికల్లో వ్యాఖ్యాతగానూ పనిచేశారు. ఇక జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన నేతలకు మొండిచేయి చూపారనే చర్చ ▶ 2లో

కారుమంచి 'బాలిక' ఘటనపై

గోప్యంగా, నిష్పక్షపాతంగా విచారణ

- వైసీపీ నేతల స్వార్థ రాజకీయాలు సిగ్గుచేటు
- మంత్రి బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

కారుమంచి ఘటనలో బాలిక భవిష్యత్ దష్ట్యా గోప్యంగా, నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కానీ వైసీపీ నేతలు పరామర్శ పేరుతో జిజిహెచ్ (రిమ్స్) వద్ద చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేలా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేస్తున్న అధికారులను బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. వైసిపి హయాంలో మహిళలపై రెండు లక్షలకు పైగా అఘాయిత్యాలు జరిగితే ఏం చర్యలు తీసుకున్నారని అడిగారు. లేని దిశ చట్టం పేరుతో మహిళలను మోసం చేసింది జగన్ కాదా? అని అడిగారు. మొన్న చిత్తూరు జిల్లాలో తమ కూతురిపై అత్యాచారం జరగలేదని బాలిక తల్లిదండ్రులు చెబుతున్నా... వైసీపీ నేతలు మాత్రం అఘాయిత్యం జరిగిందంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. వైసీపీ నేతలు తమ రాజకీయ లబ్ధి కోసం బాలికల గౌరవానికి భంగం వాటిల్లేలా తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. వైసీపీ నేతలు ఇకనైనా ఫేక్ ప్రచారం మానుకోవాలన్నారు. వైసీపీ నేతల్లాగా తప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఆదిమూలపు సురేష్‌ని నియోజకవర్గ ప్రజలు ఛీ కొట్టినా తన తీరు మార్చుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపిలో తన మీద ముగ్గురు వ్యక్తులు పోటీ చేసి ఒక్కరూ గెలవలేకపోయారనే విషయం గుర్తించుకోవాలన్నారు. ఇప్పుడు వైసీపీలో ఇన్‌ఛార్జి కోసం వారిలోవారే పోటీ పడుతున్నారని, ఇది సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎవరొచ్చినా కొండపిలో వైసీపీకి చోటు లేదన్నారు.

రైలులో మత్తు మందిచ్చి దోపిడీ

▲ 7లో

'సూపర్ సిక్స్' అమలు చేయకుండా..

ప్రజలపై అధిక భారాలు

- మతోన్మాద విధానాలు విడనాడాలి..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ రమాదేవి

ప్రజాశక్తి-రేపల్లె

కేంద్రంలో బిజెపి ప్రభుత్వంతో అంటకాగుతున్న రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీ సూపర్ సిక్స్‌ను అమలుచేయడం చేతకాక ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజలపై పెద్ద ఎత్తున భారాలను వేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్, మతోన్మాద విధానాలు ఆపకపోతే పాత ప్రభుత్వాలకు పట్టిన గతే పడుతుందన్నారు. సిపిఎం రేపల్లె పట్టణ రెండో మహాసభలు మైనేని సీతారామయ్య కల్యాణ మండపంలో జరిగింది. ఈ మహాసభకు కామ్రేడ్ అమిరినేని లక్ష్మయ్య ప్రాంగణంగా నామకరణం చేశారు. అధ్యక్ష వర్గంగా సిపిఎం నాయకులు కేవీ.లక్ష్మణరావు, వై.కిషోర్ వ్యవహరించారు. మహాసభల ప్రారంభానికి ముందు సీనియర్ సభ్యులు యార్లగడ్డ శివయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ దేశంలో పూర్తి మెజారిటీ లేని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రజల సమస్యలను పక్కనపెట్టి మతంపేరుతో అస్తిత్వ ఉద్యమాలని ముందుకు తీసుకొస్తుం దని విమర్శించారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ధరలు తగ్గించాలని సిపిఎం పిలుపులో భాగంగా నవంబర్ 14వ తేదీన బాపట్ల జిల్లా కలెక్టర్ ▶ 2లో

కేసులకు భయపడే ప్రసక్తే లేదు..

- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తనపై ఎన్ని కేసులు బనాయించినా భయపడే ప్రసక్తే లేదని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతిని ఎత్తిచూపడమే తాను చేసిన తప్పా.? అని ప్రశ్నించారు. నీళ్లు తోలకపోయినా బిల్లులు చెల్లిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అయినా పుల్లలచెరువు, త్రిపురాంతకం రోడ్ల ఊసే పట్టించుకోలేదని ఆరోపించారు. డిగ్రీ కళాశాలకు కనీసం అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉన్న గ్రూపుల్లోనే విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ ఐదు నెలల కాలంలో వైసీపీ నాయకులపై ఎన్నో కేసులు పెట్టారని వివరించారు. గురిజేపల్లిలో పంట పొలాన్ని నాశనం చేసిన విషయంలో తాను స్వయంగా పొలాన్ని పరిశీలించి టిడిపి నాయకులపై కేసు పెడితే ఇంత వరకు పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పేకాట క్లబ్‌లు ▶ 2లో



గొలమారి వెంకటరెడ్డి



మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి



తేజస్విని

నామినేటెడ్ పదవుల పందేరం

(మొదటిపేజీ తరువాయి)

సాగుతోంది. ఎమ్మెల్యేల తర్వాత స్థానంలో ఉండే బలమైన ద్వితీయశ్రేణి నేతలకు ఒక్కరికీ పదవి రాలేదు. మిగిలింది కార్పొరేషన్లలో డైరెక్టర్ల పదవులే.. వీటిని పంచాల్సిందే. కీలకమైనవన్నీ ఇచ్చేశారు. ఇంకా కొన్ని కుల కార్పొరేషన్ల ఛైర్మన్లను పెండింగులో పెట్టారు. జిల్లాకు సంబంధించి ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా ఎవరినీ ఎంపిక చేయలేదు. దీన్ని పెండింగ్‌లో పెట్టారు. జనసేన నేత రియాజ్‌కు ఈ పదవి ఇస్తారనే ప్రచారం ఉంది. అయితే ప్రస్తుతం దానిపై ఇంకా నిర్ణయం తీసుకోకపోవడం చర్చగా మారింది. పార్టీల మధ్య పంపకాల్లో స్పష్టతకు రావాల్సి ఉంది. ఇప్పుడు పదవులు పొందిన ముగ్గురూ ఎక్కువగా సోషల్ మీడియా ద్వారా పార్టీ విజయానికి కృషి చేశారు. ప్రత్యక్షంగా ఎమ్మెల్యేల గెలుపు కోసం కృషి చేసిన ద్వితీయ శ్రేణి నేతలకు పదవులు రాకపోవడంతో వాళ్ళు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలువురు నేతలు టిటిడి బోర్డు సభ్యులుగానూ, శ్రీశైలం బోర్డు సభ్యులుగానూ అవకాశం కోసం ధరఖాస్తులు పెట్టుకున్నారు. ఎవరికీ రాలేదు. అందరిలోనూ నిరాశే కనిపిస్తోంది. ఏదేమైనప్పటికీ పదవుల పందేరం దాదాపుగా ముగిసినట్లే. వాటిపై భ్రమలు వీడిపోయాయి. మిగిలిపోయిన కొద్దిపాటి పదవులు త్వరలోనే వెల్లడించే అవకాశాలున్నాయి.

బాపట్లకు 4 పదవులు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులుగా ఉన్న సలగల రాజశేఖర్ బాపట్ల మాజీ ఎంపి సలగల బెంజిమన్ కుమారుడు. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న రాజశేఖర్ మొన్నటి ఎన్నికల్లో టిడిపి టిక్కెట్ ఆశించారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా జిల్లాలోని ఇంకొల్లుకు చెందిన పెదపూడి విజయ్ కుమార్ ఎంపికయ్యారు. జనసేన పార్టీలో క్రియాశీలపాత్ర పోషిస్తున్న విజయకుమార్‌కు పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సిఫార్సుల మేరకు ఈ పదవి దక్కింది.

ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రేపల్లె మండలం లంకెవాని దిబ్బకు చెందిన చిలకలపూడి పాపారావు ఎంపికయ్యారు. సర్పంచుల సంఘ అధ్యక్షుడిగా ఉన్న పాపారావు జనసేన పార్టీ చురుగ్గా ఉంటూ మొన్నటి ఎన్నికల్లో అవనిగడ్డ, రేపల్లె నియోజవర్గాల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు.

వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమించబడిన తెలుగుదేశం జనసేన నేతలకు బాపట్ల ఎంపి టి.కృష్ణప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ ఎంతో నమ్మకంతో వారికి బాధ్యతలు అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదవులకు వన్నె తీసుకురావాలని కోరారు.

కేసులకు భయపడే ప్రసక్తే లేదు..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారని, తాను సెప్టెంబర్ నెలలో సోషల్ మీడియాలో ఎక్స్‌లో పోస్టు చేశానని తెలిపారు. అప్పుడే టిడిపి కార్యకర్త చేదూరి కిశోర్ తాను చేసిన ఈ పోస్టుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉద్దేశపూర్వకంగా కావాలనే మంత్రి లోకేష్‌పై బురద జల్లేందుకు సోషల్ మీడియాలో అవినీతి ఆరోపణలు చేస్తున్నాడంటూ యర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఇప్పటిదాకా పట్టించుకోని పోలీసులు కేసు నమోదు చేసిన విషయాన్ని తనకు నాలుగు రోజులు క్రితం వాట్సాప్ ద్వారా పంపారని చెప్పారు. అదే విధంగా సోషల్ మీడియా కోసం వినియోగించే డివైజ్‌ను తమకు అందించాలని నోటీసులో తెలిపారని పేర్కొన్నారు. ఇలాగే నియోజకవర్గంలోని ఐదు పోలీస్ స్టేషన్‌లలో తనపై కేసులు నమోదైనట్లు పోలీసులు తెలియజేస్తున్నారని చెప్పారు. ఇలాంటి కేసులకు భయపడేది లేదని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తానన్నారు. నియోజకవర్గంలో మట్టి, ఇసుక, మద్యం, బియ్యం యథేచ్ఛగా తరలుతుంటే ప్రశ్నించడమే తాను చేసిన తప్పా.? అని పేర్కొన్నారు. దోర్నాల మండలానికి చెందిన టిడిపి నాయకుడే ఒక ఉద్యోగం కోసం ఇన్‌ఛార్జి రూ.1.50 లక్షలు అడుగుతున్నాడని బహిరంగంగానే చెబుతుంటే ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఒక్క వారంలోనే రెండు లారీల అక్రమ బియ్యం పట్టుబడితే తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కక్కుర్తి రాజకీయాలు చేయడం తగదన్నారు. గతంలో తాము అభివృద్ధి చేయలేదనే మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు ఈ ఐదు నెలల కాలంలో వెలగబెట్టింది ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులకు సంబంధం లేకుండా పంచాయతీ కార్యదర్శులను అడ్డం పెట్టుకొని పనులను చేయడం ఎంత వరకు సబబన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వైసీపీ కార్యకర్తలను, నాయకులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. పోలీస్ అధికారులు కూడా ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలే తప్ప అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించకూడదని చెప్పారు. అన్ని శాఖల అధికారులు చేస్తున్న అవినీతిని గమనిస్తూనే ఉన్నామన్నారు. వారిపై చట్టపరమైన న్యాయపోరాటం చేసి శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సర్పంచ్‌లు దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, తమ్మిరెడ్డి సత్తిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, ఎస్‌ఎం జబివుల్లా, ఒంగోలు సుబ్బారెడ్డి, రాములు నాయక్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై అధిక భారాలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్ పాల్గొన్నారు.

రేపల్లె పట్టణ కార్యదర్శిగా మణిలాల్



సిపిఎం రేపల్లె పట్టణ కమిటీ ఏడుగురితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. కార్యదర్శిగా సిహెచ్.మణిలాల్ ఎన్నికయ్యారు. పట్టణ కమిటీ సభ్యులుగా కె.ఆశీర్వాదం, కేవీ.లక్ష్మణరావు, జె.ధర్మరాజు, ఎన్.శివశంకర్, కె.ఝాన్సీ, బి.నాగరాజు, ఆహ్వానితులుగా వై.కిషోర్, కే.రమేష్, కే.వెంకట్ ఎన్నికయ్యారు.

కొత్త ఓటర్లు చేరాలి

ప్రజాశక్తి-దర్శి: స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో ఓటర్లు కొత్త ఓట్లు నమోదు, తొలగింపులు చేసుకోవాలని దర్శి నియోజకజకవర్గ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను విడుదల చేసి అభ్యాంతరాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

ప్రజాశక్తి
3
ఆదివారం 10 నవంబరు 2024



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

11న చలో ఒంగోలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈనెల 11న జరిగే చలో ఒంగోలు మాదిగల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల జాతీయ ఉపాధ్యక్షుడు బొంత యేసుదాసు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో ఏసుదాసు ఆధ్వర్యంలో ఇంటింటి కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న జరిగే మాదిగల ఆత్మగౌరవ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, సల్మాన్, బిక్షాల్, దావీదు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఈతముక్కల ప్రాథమిక వైద్యశాలలో తనిఖీ

ప్రజాశక్తి-కొత్తపట్నం

వైద్యశాలలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి నెల కాన్పుల కోసం ఎంతమంది ఆసుపత్రికి వస్తున్నారు? ఎన్నో కాన్పు కోసం వస్తున్నారు? వారికి అందిస్తున్న మందులు, వారి ఆరోగ్య పర్యవేక్షణ తదితర వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్, కాన్పుల గది, ఆఫీసును పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసిన సిబ్బంది అందరూ వాస్తవంగా విధులలో ఉన్నారో లేరో కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా ఉద్యోగుల విధులకు సంబంధించిన విధివిధానాలు, వారు నిర్వహిస్తున్న రిజిస్టర్లను ఆమె తనిఖీ చేశారు. ఓపీల నమోదు రిజిస్టర్లు, ఎనీమియా రిజిస్టర్లు, ల్యాబ్ రిజిస్టర్ల నిర్వహణలో నిర్దిష్ట విధానం లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

జిల్లాలోని అన్ని ఆసుపత్రుల రిజిస్టర్ల నిర్వహణలో ఏకరూపత (యూనిఫామ్) ఉండేలా చూడాలని డీఎంహెచ్‌వో సురేష్ కుమార్‌ను ఆదేశించారు. ప్రసవ అంచనా తేదీ (ఈ.డి.డి), ఆశాల సమావేశం, కుటుంబ ప్రణాళిక రిజిస్టర్లను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ విషయాలలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు ఆమె స్పష్టం చేశారు. గర్భిణులకు స్వయంగా వైద్యాధికారులే బిపి చెక్ చేయాలని కలెక్టర్ చెప్పారు. ఆసుపత్రిలో అందించే సేవలను డిస్‌ప్లే చేసేలా బోర్డు పెట్టాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డి.సి.హెచ్.ఎస్. సూరిబాబు, తహశీల్దార్ మధుసూదన్ రావు, వైద్యాధికారులు శివపార్వతి, నవ్యారెడ్డి, తదితరులు ఉన్నారు.

అవస్థల ప్రయాణం

రామాపురంలో అధ్వానంగా రోడ్డు

రహదారిపై నిల్వ ఉన్న మురికి నీరు

బురదలో పడిపోతున్న వాహనాలు

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం గుడిమెట్ట గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డుపై మురికి నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా సోమిదేవి పల్లె గ్రామానికి, దగ్గరలోని సిద్ధ బైరేశ్వర స్వామి దేవస్థానానికి ప్రజలు నిత్యం వెళ్తుంటారు. ప్రస్తుతం కార్తీక మాసం సందర్భంగా ఈ రోడ్డు ద్వారా దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తుల ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహన దారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామంలో ఇళ్లలో వాడుక నీరు మొత్తం రోడ్డుపైకి వచ్చి చేరి నిత్యం జీవనది లాగా ప్రవహిస్తోంది. బురద, మురికి నీరు నిల్వ కావటంతో ఈగలు, దోమలకు నిలయంగా మారింది. దీంతో ఆ పరిసర ప్రాంత నివాసులకు విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. అది గుంతనా, పల్లమా అర్థం కాక వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రోడ్డుకి ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మించి, రోడ్డులో నీరు నిలువ లేకుండా చేసి ప్రమాదాలు, విషజ్వరాలు ప్రబలకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని రాచర్ల మండలం సిఐటియు కార్యదర్శి డి.తామస్ సంబంధిత అధికారులను కోరారు.



రామాపురంలో రహదారి దుస్థితి



భద్రతా సిబ్బందికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

గ్రానైట్ క్వారీలో భద్రతా తనిఖీలు

ప్రజాశక్తి-చీమకుర్తి

ఆర్.ఎల్ పురం పంచాయతీ పరిధిలోని గోల్డెన్ గ్రానైట్ గనిలో భద్రతా తనిఖీలు నిర్వహించారు. 22వ గనుల భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆఖరి రోజు అయిన శనివారం వివిధ క్వారీలలో భద్రతా తనిఖీల విస్తృతంగా చేపట్టారు. గోల్డెన్ గ్రానైట్ గనిలో టీం లీడర్ ఎస్.మురళీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో టీం సభ్యులు విస్తృతంగా వివిధ విభాగాలలో తనిఖీలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ.గిరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీం సభ్యులకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సేఫ్టీ వీక్ పతాకాన్ని ఆవిష్కరించారు. రికార్డులను పరిశీలించారు. ప్రథమ చికిత్స ఏర్పాటు కార్యక్రమాలను, సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ గ్రానైట్ ఫస్ట్ క్లాస్ మేనేజర్ యు.ఫణి కుమార్, సేఫ్టీ వీక్ కమిటీ జాయింట్ సెక్రెటరీ ఏ.రవి కుమార్, సభ్యులు టీవీ లోకేష్, కుమారస్వామి, డి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్కే నాయబ్ రసూల్, మెకానికల్ ఇన్‌ఛార్జి నారాయణరెడ్డి, సెల్వం పాల్గొన్నారు, యాపిల్ గ్రానైట్ గనిలో జరిగిన భద్రతా తనిఖీల కార్యక్రమంలో యాపిల్ గ్రానైట్ ఏజెంట్ శిద్దా పవన్ కుమార్, టీం సభ్యులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదానే పరిష్కారం

ఏఐసిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు విజయరాజు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా అత్యంత పరిష్కారమని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గద్దపాటి విజయరాజు పేర్కొన్నారు. ఒంగోలు ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో దళిత ఉద్యోగుల యునైటెడ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా సాధించటంపై చర్చా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గద్దపాటి విజయరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి అందించిన మత స్వేచ్ఛ హక్కుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజ్యాంగం ప్రకారం దేశంలోని ప్రతి వ్యక్తి తను ఇష్టం వచ్చిన మతాన్ని స్వీకరించుకోవడమనే హక్కుందని, క్రైస్తవ్యంలోకి వచ్చే దళితులు తమ ఎస్సీ హోదా కోల్పోవడం దారుణమైన వివక్ష అని అభిప్రాయపడ్డారు. 2007లో రంగనాథ్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి కొన్ని సిఫారసులు చేసిందని, అన్ని మతాలలో ఉన్న దళితులకు ఎస్‌సి హెూదా కల్పించాలనే సూచన చేసిందన్నారు. ప్రస్తుతం ముస్లిం, క్రైస్తవ దళితులకు ఎస్‌సి హెూదా లేకపోవడం రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వం, న్యాయం లక్ష్యాలకు విరుద్ధంగా ఉందన్నారు. రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులు ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం దేశంలోని లక్షలాది దళిత క్రైస్తవులకు న్యాయం అందకుండా చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో దళిత క్రైస్తవులకు ఎస్‌సి హెూదా ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ద్వారా మేలు పొందిన వారిలో ఎంతో మంది ఉద్యోగస్తులు ఉన్నారన్నారు. సమాజం మేలు కోసం పని చేయడంలో మరింత ఎక్కువ బాధ్యత ఉందన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న విజయరాజు

ఎస్‌సి హోదా పొందిన ఇతర దళితుల మాదిరిగా క్రైస్తవ మతం స్వీకరించిన దళితులు కూడా సమాన హక్కులు పొందాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఆర్ఎస్ సెల్వన్ రాజ్, ఎస్‌టి ఉద్యోగసంఘాల నాయకులు ఎలక్ట్రిసిటీ డీఈ సుధీర్, కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు కోఆర్డినేటర్ పాలపర్తి విజేష్ రాజ్, విశ్రాంత ఆర్ఎస్ఐ తిమోతి, పాలపర్తి ఆల్బర్ట్ మాథ్యూస్, బిషప్ బి.శ్యాంసన్, గూడూరి రవి కుమార్, పాస్టర్ కె.డేవిడ్ రాజు, కె.పెద్దన్న, ఎంఇఎఫ్ యేసుదాస్, విజయేంద్ర బహుజన, రాయపాటి జగదీష్, పాలపర్తి మోహన్, పాస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఇద్దరు నిర్వాహకులు అరెస్టు

ప్రజాశక్తి - గిద్దలూరు

గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై శనివారం సిఐ సురేష్ దాడులు నిర్వహించి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కొప్పువారి వీధిలోని ఒక నివాసంలో నిర్వాహకులు బోయ నాగరాజు, సాలమ్మ గుట్టు చప్పుడు కాకుండా కొంత మంది మహిళలను తెచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ సురేష్ ఆ ఇంటిపై దాడులు నిర్వహించి నిర్వాహకులతో పాటు ఇద్దరు విటులు, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-తర్లుపాడు

మండల కేంద్రమైన తర్లుపాడులోని ఓ బడ్డీ కొట్టులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని యజమానిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపిన వివరాల మేరకు.. తర్లుపాడులోని ఎస్సీ హాస్టల్ ఎదురుగా వున్న బడ్డీ కొట్టులో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందించడంతో శనివారం తనిఖీ చేశారు. అతని వద్ద నుంచి ఐదు క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకొని దుకాణం యజమాని శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా బెల్ట్ షాపు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

యర్రగొండపాలెం: 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. యర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు తన సిబ్బందిలో కలిసి త్రిపురాంతకం మండలంలోని మేడపి గ్రామ బస్టాప్‌లో మేంద్రగుత్తి నాగమ్మ అనే మహిళ 10 మద్యం బాటిళ్లు కలిగి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకొని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అలాగే పుల్లలచెరువు మండలంలోని ఐటివరం ఎస్సీ కాలనీలో గల బడ్డీ బంకులో ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని మద్యాన్ని విక్రయిస్తున్న గూడూరి సాల్మన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ ఆదేశాల మేరకు తాము దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ మద్యాన్ని విక్రయించినా, బెల్టు షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'అభయ' యాప్‌తో వైద్య సేవలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అభయ యాప్ ద్వారా యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఓపి విభాగంలో నూతన విధానానికి చర్యలు చేపట్టినట్లు ఏరియా వైద్యశాల మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ దేవర యదిద్యా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి చికిత్సలకు వచ్చే రోగుల కోసం క్యూఆర్ విధానాన్ని నూతనంగా అమలులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆభయ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌లో యాండ్రాయిడ్ మొబైల్‌లో స్కాన్ చేసుకోవాలన్నారు. అందులో సంబంధిత రోగి వివరాలు నమోదై అవసరమైన వైద్య విభాగానికి ఆ వివరాలు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఏరియా వైద్యశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలతో పాటు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి-కొండపి

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని తహశీల్దార్ పి.మురళి అన్నారు. కొండపి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో బూత్ లెవల్ అధికారులచే శనివారం ఓటు కోసం ప్రత్యేక ప్రచారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 147 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో కొత్త ఓటు కోసం ఫాం-6లు 10, డిలేషన్ కోసం ఫాం-7లు 25, తప్పుల సవరణ కోసం 112 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. శనివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌వోలు అందుబాటులో ఉన్నారా లేదా అని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య గొట్టిపాటి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పంగులూరు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు మండలంలోని ముప్పవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో తెలుగుదేశం నాయకుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి విద్యార్థులకు పండ్లు, ఫలహారాలు పంచిపెట్టారు. తెలుగుదేశం అధ్యక్షులు రావురి రమేష్, మాజీ డైరీ ఛైర్మన్ బాలిన రామ సుబ్బారావు, చింతల సహదేవుడు, మాజీ జెడ్పిటిసి కరీ వెంకట సుబ్బారావు, మాజీ మండల అధ్యక్షులు కుకపల్లి ఏడుకొండలు, ఎస్సీ సెల్ అధ్యక్షులు వలపర్ల సుబ్బారావు, పొనాటి రామాంజనేయులు, అల్లంనేని బ్రహ్మానందం, పచ్చవ శ్రీనివాసరావు, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, గుడిబండ చిన్నాఆదిరెడ్డి, మాజీ సర్పంచ్ ఉన్నం రవి, తలపనేని రాంబాబు, మక్కిన శ్రీను, గడ్డం నాగేశ్వరరావు, రావెల సింగరకొండ, ఇంటూరి పూర్ణయ్య, తిరుమల శెట్టి వీరాంజనేయులు, దాసరి హనుమంతరావు పాల్గొన్నారు.


ముప్పవరం హాస్టల్లో మంత్రి గొట్టిపాటి జన్మదిన వేడుకలు


సలగలను కలిసిన టిడిపి నాయకులు

'సలగల'ను అభినందించిన నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

బాపుడా ఛైర్మన్‌గా నియమితులైన సలగల రాజశేఖర్ బాబును టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఆయన స్వగృహంలో పలువురు టిడిపి నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి బాపట్ల పార్లమెంటు ప్రధాన కార్యదర్శి తాడికొండ దయ బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బడుగు నాగేశ్వరరావు, బాపట్ల పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పి యలమంద, గొరుముచ్చు ఆనందరావు, భాష, వంశి, పరిశా రమేష్, కర్పూరపు రామారావు అభినందించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా బిజిలి కుమార్

ప్రజాశక్తి - చెరుకుపల్లి


కర్పూరపు బిజిలి కుమార్

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా కర్పూరపు బిజిలికుమార్ ఎంపిక య్యారు. ఆయన మండలంలోని బలుసులపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. నవంబర్ 11న విజయవాడలో నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సన్మానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైనందుకు బిజిలి కుమార్‌ను ఎంఇఒ లాజర్, నవీన్ కుమార్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు భాదావత్ సాంబయ్య నాయక్, తదితరులు అభినందించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు కాటూరి నాగేశ్వరరావు, కుంచా వెంకట రామ్మోహనరావు, ఉపాధ్యాయులు బిజిలి కుమార్‌ను అభినందించారు.


సూర్యలంక బీచ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు

బీచ్‌లో సౌకర్యాల పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

కార్తీక పౌర్ణమికి సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానాలకు వచ్చే పర్యాటకుల భద్రత ఏర్పాట్లపై రూరల్ సిఐ గంగాధర్, మెరైన్ సిఐ లక్ష్మారెడ్డి సూర్యలంక తీర ప్రాంతాన్ని సిబ్బందితో శనివారం పరిశీలించారు. ఎప్పటికప్పుడు పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ళు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తీరంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీరం వెంబడి పోలీస్ వాహనంతో పెట్రోలింగ్ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. 15మంది మెరైన్ సిబ్బంది ఏర్పాటు చేశామని మెరైన్ సిఐ లక్ష్మారెడ్డి తెలిపారు. రూరల్ ఎస్సై శ్రీనివాసులు, మెరైన్ ఎస్సై శ్రీనివాసరావు, మెరైన్ ఎ ఎస్సై అమరేశ్వరరావు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

కార్తీక మాసం కోటి సోమవారం సందర్భంగా శనివారం వేకువ జాము నుండి మండలంలోని శివాలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని, కార్తీకదీపం ఆరాధనలు చేశారు. ఇంకొల్లు, కొనికి, పూసపాడు, పావులూరు, ఇడుపులపాడు, గంగవరం గ్రామాల్లో మహిళలు నిష్టతో కార్తీక దీపారాధన, దైవ పూజలు చేశారు. ఆలయాల పూజారులు శివ పార్వతులకు అభిషేకం చేశారు.

మోడీ విధానాలతో ఉపాధి కోల్పోతున్న శ్రమజీవులు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా అనుసరిస్తున్న హిందూ ఫాసిస్టు విధానాలతో దేశంలో శ్రమజీవులు ఉపాధి కోల్పోతున్నారని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఆర్ మోహన్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. సభకు ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జె కల్పన అధ్యక్షత వహించారు. మోహన్ మాట్లాడుతూ ఉపాధి కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 జీవించే హక్కు ప్రజలకు కల్పించిందని అన్నారు. జీవించే హక్కు అంటే ప్రజలకు పని కల్పించడమేనని అన్నారు. భూమిని జాతీయం చేసి ప్రజలకు భూస్వాములు, కార్పొరేట్ల వద్ద ఉన్న భూములను పంచాలని అన్నారు. పరిశ్రమను స్థాపించి ప్రజలకు పని కల్పించాలని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరించి కార్మికులు, శ్రమజీవుల ఉపాధిపై దాడి చేస్తున్న ఫాసిస్ట్ పాలకులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్ విష్ణు, మేకల ప్రసాద్, కొండా అన్నమ్మ, షేక్ అజిత, ముప్పల పల్లవి, బి లాజర్, రంజాన్, ముప్పల. రాఘవులు, ఎ శ్రీను, హాఫిజ్, నాగూర్ బీ, సుధారాణిపాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ మోహన్

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ పల్లెనిద్ర

ప్రజాశక్తి - చెరుకుపల్లి


ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, ప్రజల వద్దకే పోలీసులు వెళ్లేందుకు ఎస్పీ తుషార్ డూడి పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ అన్నారు. పోలీసు అధికారులు ప్రతి శుక్రవారం తమ పరిధిలోని గ్రామాల్లో బస చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో జరుగుతున్న నేరాలు గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గుల్లపల్లిలో శుక్రవారం రాత్రి పల్లెనిద్రలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులతో మాట్లాడారు. నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వాటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాల గురించి, చెడు నడవడిక కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించడం నేరమని, ఎవరైనా బహిరంగ మద్య పానం చేస్తే తమకు సమాచారం తెలపాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే 100, 112 ఫోన్ నెంబర్లకు లేదా స్థానిక పోలీసు అధికారులకు తెలపాలని సూచించారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె రూరల్ సిఐ సురేష్ బాబు, చెరుకుపల్లి ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.


గుల్లపల్లి పల్లెనిద్రలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్

కార్పొరేషన్ ఛైర్మన్లకు ఏలూరి అభినందన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో ఛైర్మన్లుగా నియమితులైన టిడిపి, జనసేన నేతలకు తెలుగుదేశం బాపట్ల పార్లమెంటు మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్‌లు ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదవులకు వన్నె తీసుకురావాలని అన్నారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన టీడీపీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, ఎపి మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ డాక్టర్ పెద్దపూడి విజయ్ కుమార్, ఎపి హ్యాండ్లూమ్ కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ సజ్జా హేమలత, ఎపి అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావులకు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమితులైన ప్రతి ఒక్కరిని ఏలూరి అభినందించారు.


ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావును కలిసిన విజయ్



అవగాహన ర్యాలి నిర్వహిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - నిజాంపట్నం

క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రణవి అన్నారు. మండలంలోని కూచినపూడి పిహెచ్‌సిలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభం అవుతుందని తెలిపారు. మంచి అలవాట్లు, ఆరోగ్య కరమైన ఆహారంతో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవచ్చని అన్నారు. క్రమం తప్పని వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ధూమ పానం, మత్తు పానీయాలకు దూరంగా ఉండి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ముందస్తు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ఇంటి వద్దనే వైద్య ఆరోగ్య సిబ్బంది వచ్చి పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మురళి పాల్గొన్నారు.


వనజాక్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆనందబాబు

వనజాక్షికి ఘన నివాళి

ప్రజాశక్తి - వేమూరు

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాతృమూర్తి ఆలపాటి వనజాక్షి సంస్మరణ సభ ఏలూరు జిల్లా సాయిబాబా స్తూపం రోడ్డు లక్ష్మీపురంతోట, పెదవేగి గ్రామంలో శనివారం నిర్వహించారు. శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వనజాక్షి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం

ప్రజాశక్తి - చీరాల

104 వాహనాల్లో డ్రైవర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 బాపట్ల జిల్లా మేనేజర్ జె నాగేశ్వరరావు తెలిపారు. డ్రైవర్ అర్హతకు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీ లైసెన్స్, 35ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలి, ఇంగ్లీష్ చదవడం, వ్రాయడం తెలిసి ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 12లోపు 104 కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 63053 59961 నెంబర్‌ను లేక చీరాల గవర్నమెంటు ఏరియా హాస్పిటల్ రూం నెంబర్ 43 సంప్రదించాలి అన్నారు.

దోషులను వెంటనే శిక్షించాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టంగుటూరు మండలం కారుమంచి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న దళిత బాలికపై క్లాస్ రూమ్‌లోనే అత్యాచారం చేసిన ఉపాధ్యాయుని వెంటనే అరెస్టు చేసి.. శిక్షించాలని ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు వచ్చిన బాలిక తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడి అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. బాలికను పరామర్శించడానికి కూడా పోలీసులు అనుమతించక పోవడం సమంజసం కాదన్నారు. ఇది వ్యక్తి స్వేచ్ఛని హరించడమే నన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ఛైర్మన్ చిలక అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అనుచిత పోస్టులు పెట్టిన వారిపై

చర్యలు తీసుకోండి

ఎస్‌పి కార్యాలయంలో వైసిపి నేతల వినతి



సిఐ అజయ్‌కుమార్‌కు అర్జీ ఇస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులపై అనుచిత పోస్టులు పెట్టిన టిడిపి సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు కోరారు. ఈ మేరకు ఒంగోలు ఎస్‌పి కార్యాలయంలో తాలూకా సిఐ అజయ్‌కుమార్‌కు వైసిపి నేతలు వినతిపత్రం అందజేశారు. వైసిపి నేతలు మాట్లాడుతూ టిడిపి సోషల్‌మీడియా నాయకులు మాజీ సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయటం దుర్మార్గమన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయం చేయటం తగదన్నారు. అనుచిత పోస్టులు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, కొండపి ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్, మాజీ పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ మాదాసి వెంకయ్య, వైసిపి నేతలు పాల్గొన్నారు.

సాయం కోసం ఎదురుచూపులు



సాయం కోరుతున్న బాధిత కుటుంబం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి కష్ణారెడ్డి అప్పులపాలై గతంలో మృతిచెందాడు. ఆయన చనిపోయిన రెండు నెలలకే అప్పుల బాధలు తట్టుకోలేక మార్కాపురంలోని కంభం సెంటర్లో అతని భార్య సాయిలీలావతి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఇదంతా జరిగి ఏడాదైంది. అప్పటి నుంచి సాయి లీలావతి తల్లి ఆత్కూరి మధు ఉన్నతాధికారులను కలిసి అప్పుల బాధతో తన అల్లుడు, కూతురు చనిపోయారని, పిల్లలు అనాథలుగా మారారని, పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూడా అర్జీ అందజేశారు. అప్పట్లో దోర్నాల తహశీల్దార్, వ్యవసాయాధికారి విచారణకు వచ్చారు. కానీ ప్రభుత్వానికి ఇంకా నివేదిక పంపించలేదు. అధికారులు స్పందించి నివేదికనను ఉన్నతాధికారులకు పంపి పరిహారం అందజేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని, వారి పిల్లలను ప్రభుత్వమే చెల్లించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి శనివారం ప్రభుత్వాన్ని కోరారు.

బోయలపల్లి పోలింగ్ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో గల పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉండి ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో యర్రగొండపాలెం నియోజక వర్గ ఎన్నికల అధికారి ఎంవి సత్య నారాయణ బోయలపల్లిలోని పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదితో పాటు 23, 24 తేదిలలో కూడా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎలక్షన్ డిటి ఎస్ చంద్రశేఖర్, బిఎల్వో కె ఓబయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, సర్వేయర్ మధునాయక్ పాల్గొన్నారు.

● 'గొట్టిపాటి' నివాసంలో జన్మదిన వేడుకలు



రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ మరియు కడియాల రమేష్ పుట్టినరోజు సందర్భంగా టిడిపి దర్శి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్ దర్శిలోని నివాసం వద్ద శనివారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి, లలిత్‌సాగర్‌తో పాటు కడియాల రమేష్‌ను టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. అనంతరం గొట్టిపాటి లక్ష్మి తన సొంత నిధులతో నలుగురు వికలాంగులకు ట్రై సైకిళ్లు అందించారు.

- ప్రజాశక్తి, దర్శి

కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొండారెడ్డి



మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

అన్ని రకాలుగా రైతన్నలు దెబ్బతిన్నారని, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మార్కాపురం మండల సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా జివి.కొండారెడ్డి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పంటల బీమా, పెట్టుబడి రాయితీలను విడుదల చేయాలని, కష్టాలలో ఉన్న రైతులను ఆదుకోవాలని సూచించారు. ప్రకాశం జిల్లాలో 2022-23, 2023-24 సంవత్సరాలలో ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసిన రైతులలో కరువు, అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన వారే అధికమన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. కానీ నేటి వరకు వారికి రావలసిన పంటల బీమా అందలేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఈ రాయితీని నేటి ప్రభుత్వం రైతులకు ఇవ్వడం లేదన్నారు. ఆరుగాలం శ్రమించి పంట కోల్పోయిన వారిని చట్ట ప్రకారం ఆదుకోవాల్సిన ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని చెప్పారు. జిల్లాలో 2023-24 రబీ సీజన్‌లో కరువు కారణంగా జిల్లాలో 29713 హెక్టార్లలో వేసిన 36147 మంది రైతులు నష్టపోయారని, వారికి ఇవ్వాల్సిన పెట్టుబడి రాయితీ 29 కోట్ల 39 లక్షల రూపాయలు నేటికీ విడుదల చేయకపోవడం అన్యాయమని చెప్పారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్ నెలలో అధిక వర్షాలతో జిల్లాలో 5020 హెక్టార్లలో వేసిన ఆరు రకాల పంటలు దెబ్బతిని 7468 మంది రైతులకు 7 కోట్ల 12 లక్షల రూపాయలు నష్టం వాటినట్లు వ్యవసాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపారని చెప్పారు. కానీ ఇంతవరకు వారికి పెట్టుబడి రాయితీ మంజూరు చేసి ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం సరికాదన్నారు. ఈ సీజన్‌లో 11 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయని, జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం శాస్త్రీయం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పునర్విచారణ జరిపి ఈ 11 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి పంటలు వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను నిలిపివేసిందని చెప్పారు. నేడు వ్యవసాయంలో నిమగ్నమైన రైతులు పెట్టుబడికి డబ్బులు లేక, రావలసిన ప్రభుత్వ సహాయం అందక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దోపిడీ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు చట్ట ప్రకారం రావలసిన పెట్టుబడి రాయితీ, పంటలబీమాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో స్థానిక అధికార పార్టీ నేతలు అసైన్డ్ భూములను కాజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను గుర్తించి భూమిలేని వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భూముల ఆన్‌లైన్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని కోరారు. తురకా ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు డి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు డికెఎం రఫి, సిపిఎం నాయకులు అడివయ్య, తిరుపతయ్య, శేషయ్య, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో వివక్ష

- సమ న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతాం..
- అధికార పార్టీ నేతల బంధుప్రీతి కనిపిస్తోంది..
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపారని వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ధ్వజమెత్తారు. ఆక్రమణల విషయంలో అధికార పార్టీ నేతల బంధుప్రీతి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఇక్కడ కౌన్సిల్ ఉందన్న విషయాన్ని కూడా మర్చిపోయారని, ఏకపక్షంగా అధికార పార్టీకి తొత్తుగా మారారని ఆరోపించారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నా రాంబాబు మాట్లాడారు. కాలువలకు దాటి వచ్చిన కట్టడాలైనా... బంకులు, చిరు వ్యాపారులను తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నారని గుర్తు చేశారు. దానికి విరుద్ధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించారన్నారు. లక్కీ షాపింగ్ మాల్ కాలువకు లోపల ఉందన్నారు. ఆ షాపింగ్ మాల్ అద్దాలు కూడా పగులగొట్టడం ఎందుకని ప్రశ్నించారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఆక్రమణల తొలగింపు జరిగిందనడానికి అధికారులు వ్యవహరించిన తీరు అందుకు నిదర్శనమన్నారు. విహారీ గ్రాండ్ ఇన్ వద్ద ఇంచి కూడా ఆక్రమణ లేదన్నారు. సెల్లార్‌లోకి వాహనం వెళ్లకుండా పగులగొట్టారన్నారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలపై కట్టడాలు ఉన్నా... తొలగించలేదన్నారు. బంధుప్రీతి, స్నేహితులు, అధికార పార్టీ అక్కడ కనిపించిందని ఆరోపించారు. ఎక్కడ వివక్ష జరిగిందో కూడా తనతో పరిశీలనకు వస్తే తేలిపోతుందన్నారు. అధికారులు అందరికీ ఒకేలా వ్యవహరించాలన్నారు. ఆక్రమణల తొలగింపుకు తాము వ్యతిరేకం కాదని చెప్పారు. అభివృద్ధిలో సహకరిస్తామని చెప్పారు. ఇంత జరుగుతున్నా కనీసం మున్సిపల్ కౌన్సిల్ బాడీకి అధికారులు ఎందుకు చెప్పలేదన్నారు. చెప్పాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపు తరువాత మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆక్రమణల తొలగింపులో వివక్ష లేదని, తప్పుడు ప్రచారమేనని కందుల పేర్కొన్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్పందించారు. ఆక్రమణల తొలగింపు ఎలా జరిగిందో తాను స్వయంగా చూస్తే అర్థం అవుతుందన్నారు. లేని పక్షంలో తనతో రావాలని కోరారు. వెలిగొండ విషయంలోఎమ్మెల్యే కందుల చేసిన ఆరోపణలను మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఖండించారు. వైసిపి నేతలపై నిందలు వేయడం సరికాదన్నారు. ఎవరి హయాంలో ఎంతమేర పనులు జరిగాయో అధికారుల ద్వారా లెక్కలు తెప్పించుకోమన్నారు. అవసరమైతే చర్చకు తాను సిద్ధమన్నారు. దేవాదాయ శాఖ భూములను కాపాడుతామని ఎమ్మెల్యే కందుల చెప్పడం జరిగిందన్నారు. ఆ భూములు ఎవరు కబ్జా చేశారో బయటకు తీయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా చేస్తామన్నారని, ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో ఇక్కడ ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం చేపడితే... టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత దాన్ని నిలిపివేసిందన్నారు. ప్రయివేటు మెడికల్ కళాశాలగా మార్చుతున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పకనే చెప్పారన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలగా కొనసాగించాలన్నారు. అప్పుడే పేద విద్యార్థులు డాక్టర్లుగా రాణిస్తారన్నారు. పొదిలి, మార్కాపురం ప్రాంతంలో జరిగిన ఆక్రమణల తొలగింపులో జీవనోపాధి కోల్పోయిన పేదలందరికీ ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ఆక్రమణల తొలగింపుతో ఊరుకోకుండా విద్యుత్ స్తంభాలను వెనక్కి వేయాలని, తరువాత రహదారి నిర్మించాలన్నారు. ఆ విధంగా చేయకపోతే ఆక్రమణల తొలగింపుకు అర్థం ఉండదన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, ఎపి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మీర్జా షంషీర్ అలిబేగ్, కౌన్సిలర్లు ముంగమూరి శ్రీనివాసులు, షేక్ చిన్నషెక్షావలి, షేక్ సలీం, బుశ్శెట్టి నాగేశ్వరరావు, కొట్టే రామలక్ష్మమ్మ, కొత్త క్రిష్ణ, వైసిపి నాయకులు గుంటక చెన్నారెడ్డి, బండి క్రిష్ణారెడ్డి, కుమ్మరి శ్రీను, పత్తి రవిచంద్ర, మహిళా నాయకురాలు పోరుమామిళ్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుమూర్తి సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి - పంగులూరు


వీరంకి గురుమూర్తి

బిసిల సంక్షేమం కోసం పనిచేసే వీరంకి గురుమూర్తిని ప్రభుత్వం గుర్తించిందని, ఆయనకు ఆంధ్ర ప్రదేశ్ గౌడ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి ఇవ్వటం సంతోషకరమని గౌడ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి హనుమంతరావు శనివారం తెలిపారు. గురుమూర్తి కష్టపడే తత్వాన్ని తెలుగుదేశం నాయకత్వం గుర్తించిందని అన్నారు. గురుమూర్తికి చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌కు గౌడ సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

పదవులు బాధ్యతగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రేపల్లె

నూతనంగా ఎంపికైన చైర్మన్లు పదవులకు వన్నె తెచ్చే విధంగా బాధ్యతగా విధులు నిర్వహించాలని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ కోరారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల 2వ జాబితాలో ఏపీ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్లుగా ఎంపికైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పార్టీ కోసం పని చేసిన వారిని ప్రోత్సహించే విధంగా వివిధ కార్పొరేషన్ చైర్మన్లగా ఎంపిక చేయటం హర్షనీయం అన్నారు. జనసేన రాష్ట్ర చేనేత వికాస విభాగం చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి మంగళగిరి ఇంఛార్జి, ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావుకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన మంగళగిరి ఇంఛార్జిగా ఉంటూ, 2019, 2024 ఎన్నికల్లో పొత్తులో భాగంగా శాసన సభ టికెటు రాకపోయినా జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలియజేసి అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తని కొనియాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేన బలోపేతానికి కృషి చేసిన నాయకులు చిల్లపల్లి శ్రీనివాస్ కాగా తీర ప్రాంతంలో అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి విశేష కృషి చేసిన చిలకలుపూడి పాపారావు సేవలను గుర్తు చేశారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి కష్టపడి పని చేసిన నాయకులను గుర్తించి పదవులకు ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు.


మణికేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు

మణికేశ్వరంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - అద్దంకి

కోటి సోమవారం సందర్భంగా మండలంలోని మణికేశ్వరంలో వేంచేసిఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తుల శివనామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. మహిళలు వేకువ జామునుండే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాలకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మహిళా భక్తులు స్వామి వారికి దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రమిదలు దీపాలు వెలిగించారు. ఆలయంలో వేద పండితులు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు గ్రామస్తులు షేక్ కరిముల్లా, అంజయ్య భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన


బాపట్ల న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న లీలా కృష్ణ

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థులు న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ న్యాయవాది భీమా లీలాకృష్ణ అన్నారు. న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిజన కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. లోక్ అదాలత్ అనేది దేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం, సుదీర్ఘ వ్యాజ్యం అవసరం లేకుండా పరస్పర అంగీకారం, రాజీ ద్వారా వివాదాలు పరిష్కరించడం అన్నారు. లోక్ అదాలత్ ప్రాథమిక లక్ష్యం ప్రజలకు సత్వర న్యాయం అందించటమే ఉద్దేశ్యమన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వ్యక్తులకు ఉచిత న్యాయ సేవలు అందించుడం, న్యాయ సహాయం పొందేందుకు ప్రతి ఒక్కరూ వారి ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా న్యాయం, చట్టపరమైన ప్రాతినిధ్యాన్ని పొందేలా చేయడమే అన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన లేదా పరిమిత ఆదాయ వనరుల వంటి నిర్దిష్ట ఆర్థిక ప్రమాణాలకు అనుగుణంగా ఉండే వ్యక్తులకు న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఇతర చట్టాలపై న్యాయ వాదులు విద్యార్థులకు లోక్ అదాలత్, లీగల్ ఎయిడ్, నల్సా హెల్ప్ లైన్ 15100 అవగాహన కల్పించారు. సదస్సులో ప్యానల్ న్యాయవాది అంగలకుదురు నటరాజ్, పారా లీగల్ వాలంటీర్లు కనపర్తి రాజారావు, పొందగల ప్రసాదరావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి పాల్గొన్నారు.

అద్దంకి : జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో న్యాయమూర్తి డి నాగ వెంకటలక్ష్మి శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయంను అర్హులైన వారు ఉపయోగించుకొని సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చుని న్యాయ మూర్తి తెలిపారు. అనంతరం హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది ఎర్రమోతు రమేష్ బాబు, సీనియర్ న్యాయవాది పిఎల్ఎన్ ప్రసాద్, రిటైనర్ న్యాయ వాదులు టి మార్త శ్రీనివాస్, ఎం ప్రకాష్, షేక్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

చీరాల : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని తద్వారా సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధా అన్నారు. పట్టణంలోని వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాతీ య న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సుకు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం .సుధా విద్యార్థులకు వివిధ చట్టాల గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ నీలా కుమారి, ఎస్ఐ కమలాకర్, న్యాయవాదులు రామకృష్ణారెడ్డి, ఈశ్వరిరెడ్డి, రాజేశ్వరి, పిఎల్‌విలు సయ్యద్ మతీన్ పాల్గొన్నారు.

రేపల్లె : మారిన చట్టాలకు అనుగుణంగా పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన ప్రాధాన్యత కల్పిస్తూ కోర్టులు చట్టాలు చేశాయని, వాటి పట్ల అవగాహన కలిగి ఉండడమే కాకుండా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నందు అంగన్‌వాడి కార్యకర్తలు, సూపర్వైజర్లకు మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సివిల్, క్రిమినల్ కేసులు పురుషులతో పాటు మహిళలకు కూడా వర్తిస్తాయని అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన నూతన చట్టాలు పట్ల మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, వరకట్న నిషేధం భార్యా భర్తలు వివాదాలు ఆస్తి తగాదాలు భరణం మనోవర్తి ప్రామిసరీ నోట్, మానవ అక్రమ రవాణా, ఫోక్సు చట్టం తదితర చట్టాల గురించి వివరించారు. ఏదైనా కేసులు విషయంలో తగు సూచనలు, సలహాలు తెలుసుకోవాలంటే స్థానిక న్యాయస్థాన నందు కోర్టు అధికారులు, న్యాయమూర్తిని సంప్రదించవచ్చని అన్నారు. ఆర్థిక స్తోమత లేని ఎస్సీ, ఎస్టీలు కేసులు పరిష్కారం కోసం అవసరమైతే న్యాయస్థానం ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసులను వాదించేందుకు న్యాయవాదిని ఏర్పాటు చేయటమే కాకుండా అందుకు అయ్యే ఖర్చును న్యాయస్థానమే భరిస్తుందని న్యాయమూర్తి వివరించారు. ప్రతిఏట నవంబరు 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు. పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు, ఎం చిన్న యానాదిరావు మాట్లాడుతూ ప్రతి ఏటా నవంబర్ 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవం జరుపుకోవడం, అందుకు అనుగుణంగా సుప్రీంకోర్టు హైకోర్టు జారీ చేసిన నూతన చట్టాలు, వాటి వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. మారిన చట్టాలు ప్రస్తుత అమల్లో ఉన్న చట్టాలు గురించి పురుషులతో పాటు స్త్రీలు తెలుసు కోవాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాసరావు, ఒడుగు రాంబాబు, పవన్ కుమార్, దీవి హరికుమార్, పోతురాజు, రేపు నాగరాజు, సంజయ్, ఆరేపల్లి మధుసూదన్ రావు, పారా లీగల్ వాలంటీర్ సయ్యద్ తాహిర్ అహ్మద్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు జ్యోతి, రజిని, వాణిశ్రీ, అరుణ, వెంకటరత్నం, మాణిక్యం, డిజిటల్ అసిస్టెంట్ సుమన్ పాల్గొన్నారు.



అద్దంకి సదస్సులో మాట్లాడుతున్న జడ్జి డి నాగవెంకటలక్ష్మి



చీరాల సధస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి ఎం సుధ

సోషల్ మీడియా కార్యకర్తలపై అనవసర కేసులు పెట్టొద్దు


ఎస్‌పికి వినతి పత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై అనవసరమైన కేసులు పెట్టొద్దని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు మేరుగ నాగర్జున అన్నారు. మాజీ డిప్యూటి స్పీకర్ కోన రఘుపతి, వైసిపి నాయకులు అనిమి రెడ్డి, వైసిపి కార్యకర్తలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై దాడి జరుగుతున్న నేపథ్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా కార్యకర్తలను భయపెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్న నేపథ్యంలో నాయకులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా చిన్న పొరపాట్లు ఉన్నప్పటికీ సర్దుబాటు చేసుకుని పోవాలని అన్నారు. ప్రధానంగా పోలీసులు సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. వైసిపి అధికారంలో ఉన్న కాలంలో ఈ విధమైన చర్యలకు పాల్పడలేదని అన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే రాబోయే రోజుల్లో ప్రతిఘటన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసే పద్ధతి మానుకోవాలని సూచించారు. రాజకీయ విధానాలపై పెట్టే పోస్టులను నియంత్రించాలనుకోవడం మంచి పద్ధతి కాదని అన్నారు. యేమైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప కేసులు పెట్టి కార్యకర్తలను భయపెట్టాలను కోవడం ఏమిటని అన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, వైసిపి మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జోగి రాజా పాల్గొన్నారు.


మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


అక్రమ మద్యం నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - రేపల్లె

ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చిన మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ప్రోహిభిషన్, ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సిఐ దివాకర్‌కు వచ్చిన సమాచారం మేరకు గంగటిపాలెంలో లంకె కృష్ణ మోహన్ అనే వ్యక్తి బెంగళూరు నుంచి తీసుకువచ్చిన 15 బాటిళ్ల విస్కీని అక్రమంగా విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కృష్ణమోహన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచినట్లు సిఐ దివాకర్ తెలిపారు. గ్రామాల్ఓ ఎవరైనా అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాపట్ల : మండలంలోని ముత్తాయపాలెంలో అక్రమంగా డిఫెన్స్ మద్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐపి గీతిక విలేకరులకు శనివారం తెలిపారు. అరెస్టు చేసిన నిందితుల వద్ద నుండి 750 ఎంఎల్ పరిమాణం గల 9 డిఫెన్స్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. వారి పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచిన ట్లు తెలిపారు. అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న వారిలో ఎక్సైజ్ ఎస్సై లు డి ప్రభుదాస్, ఎస్ మౌనిక పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో మద్యం అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తి

రైలులో మత్తు మందిచ్చి దోపిడీ

• మహిళ వద్ద రూ.10 లక్షలు విలువైన బంగారం చోరీ • పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో ఘటన • దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు

ప్రజాశక్తి - చీరాల

రైలులో ప్రయాణికులు తరహాలో పక్కనే కూర్చుని మహిళకు మాయమాటలు చెప్పి ఇంతలోనే జ్యూస్ తాగమంటూ ఆ మహిళకు మత్తు మందు కలిపిన జ్యూస్ ఇచ్చి చోరీకి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. బాధిత మహిళ అపస్మారక స్థితిలోకి చేరుకోగానే ఆమె మెడలో, బ్యాగులోని విలువైన బంగారపు ఆభరణాలు అపహరించారు. అక్కడి నుంచి ఉడాయించారు. ఈ తరుణంలో కొద్దిసేపటికి మైకం నుంచి తేరుకున్న బాధితురాలు బ్యాగు, మెడలోని ఆభరణాలు కంపించకపోవడంతో ఆందోళకు గురైంది. శుక్రవారం రాత్రి సినీఫక్కీలో ఈ ఘటన పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలులో చోటు చేసుకుంది. తోటి ప్రయాణికులు, రైల్వే కూలీల సహకారంతో చీరాల రైల్వే స్టేషన్‌కు బాధితురాలు అతికష్టంగా చేరుకుంది. రైల్లో ప్రయాణికుల ముసుగులో తోటి మహిళకు మత్తుమందు కలిపిన జ్యూస్ తాగించి ఆపై అందిన కాడికి దోచుకొన్ని పరారైన ఘటన చెన్నై నుంచి



వివరాలు వెల్లడిస్తున్న బాధిత మహిళ అనురాధ

విజయవాడ వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ లో వెలుగు చూసింది. చెన్నైకి చెందిన అనురాధ అనే మహిళ చెన్నై నుంచి పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో పర్చూరులోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు చీరాలకు బయలు దేరింది. రైలు నెల్లూరు సమీపంలోకి వచ్చాక ప్రయాణికుల ముసుగులో ఉన్న దుండగులు ఆమెకు జ్యూస్‌లో మత్తు మందు కలిపి పక్క ప్రణాళిక ప్రకారం ఆమెకు అందజేశారు. జ్యూస్ తాగిన కొద్దిసేపటికే ఆమె మైకంలోకి వెళ్లడంతో ఆమె ఒంటిపైన, బ్యాగులోని రూ.10లక్షలు విలువైన బంగారు ఆభరణాలు అపహరించి పరారయ్యారు. రైలు ఒంగోలు సమీపానికి వచ్చే సరికి మత్తు నుంచి కొంత మేర తేరుకున్న బాధిత మహిళ అనురాధ తన బ్యాగు, ఒంటిపై నగలను చూసుకోగా లేకపోవడంతో కంగారు పడిన మహిళ పక్కనే కూర్చున్న దుండగులు, బ్యాగులు కనిపించకపోవడంతో ఆందోళన గురైంది. చీరాల వచ్చేసరికి అవి కనిపించకపోవడంతో పాటుగా ఆమె ఆరోగ్యం క్రమంగా క్షీణించడంతో గమనించిన తోటి ప్రయాణికులు, రైల్వే కూలీలు అతి కష్టం మీద మత్తులో ఉన్న ఆమెను చీరాల రైల్వే స్టేషన్‌లో దించేశారు . స్థానికుల సంచారంతో రైల్వే స్టేషన్‌కు చేరుకున్న108 సిబ్బంది చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసుకున్న జీఆర్పీఎఫ్ పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుపై రాజకీయం ఎందుకు?

• కమిషనర్ ఆదేశాలతోనే విగ్రహ ఏర్పాటు పనులు • టిడిపి చోటా నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు • అవసరమైతే కోర్టుకు వెళతానన్న మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు రాజకీయాలు అంటగట్టడం సరికాదని, కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఆదేశాలతోనే పాత బస్టాండ్ వద్ద మాజీ గవర్నర్ కోనా ప్రభాకరరావు విగ్రహ నిర్మాణ పనులు చేపట్టామని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోనా ప్రభాకరరావు విగ్రహ ఏర్పాటు విషయంలో తెలుగుదేశంలో సీనియర్ నాయకులెవరు అభ్యంతరం తెలపకపోయినా చోటా నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించడం మంచి పద్ధతి కాదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేస్తామని, ఎవరైనా కావాలని అడ్డుకోవాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో పురపాలక సంఘ అధికారులు తొలగించిన సమయంలో విగ్రహాలను వారే ఏర్పాటు చేస్తామన్నారని, ఇచ్చిన హామీ ప్రకారం విగ్రహాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

మార్పులు చేర్పులు చేస్తూ తీర్మానం చేసిన మాట వాస్తవమేనని అన్నారు. అయితే చీలు రోడ్డు ప్రాంతంలో కోన ప్రభాకరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోవడంతో పాత బస్టాండ్ వద్ద పాత ప్రదేశంలోనే తిరిగి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కోన ప్రభాకరరావు విగ్రహంతో పాటు తొలగించిన విగ్రహాలన్నీ యధాతథంగా ఏర్పాటు చేయాలని ఇరువురు కమిషనర్లను కలిసి తమ నాయకులు వినతి పత్రాలు అందజేశారని అన్నారు. అయినప్పటికీ ఏ ఒక్క కమిషనర్ కూడా స్పందించలేదన్నారు. గత మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌కు తాను చరవాణి ద్వారా మాట్లాడానని, ఎవరికి ఎటువంటి అభ్యంతరం లేకపోతే విగ్రహం పెట్టుకోవచ్చని చెప్పిన అనంతరమే విగ్రహం ఏర్పాటుకు నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. తెలుగుదేశంలో ఉన్నామంటూ చెప్పుకునే చోటా నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి వైసీపీ కార్యకర్తపై దాడి చేశారని విమర్శించారు. తీసిన ప్రదేశాలలోనే విగ్రహాలను అధికారులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, ఎంపిపి హరిబాబు, రాఘవరెడ్డి, సముద్రాల గౌడ్, వడ్డిముక్కల డేవిడ్, ఎల్లావుల ఏడుకొండలు, నారపరెడ్డి, నాగేశ్వరరెడ్డి, జోగి రాజా పాల్గొన్నారు.

వర్గీకరణపై తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం

ప్రజాశక్తి - చీరాల



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన క్రిమి లేయర్ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని మాల సంఘాల నాయకులు అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మాల సంఘాల నాయకుల శనివారం సమావేశం మాచవరపు జూలియన్ అధ్యక్షతన నిర్వహించారు. మాల మహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు, గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమైనదని పేర్కొన్నారు. రిజర్వేషన్ల క్రిమిలేయర్ 50శాతం రిజర్వేషన్ల పరిమితిని 9మంది న్యాయమూర్తుల బెంచ్ గతంలో తీర్పిస్తే ఇప్పుడు ఆరుగురు న్యాయమూర్తులు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ క్రిమిలేయర్ తీర్పు ఏ విధంగా చెల్లుబాటు అవుతుందని ప్రశ్నించారు. 9మంది మెజారిటీ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఆరుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అతిక్రమించడం ఏ విలువలు కాపాడటం కోసమని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి ప్రభుత్వం మెగా డీఎస్సీ వాయిదా వేయటం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో 5శాతం ఉన్న మాదిగల కోసం 95శాతం ఉన్న ఓసి, బిసి మైనార్టీ వర్గాల నిరుద్యోగుల భవిష్యత్తు నిర్వీర్యం చేయటం న్యాయం కాదని అన్నారు. వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సదస్సులో దార్ల శాస్త్రి, దేవరపల్లి బాబూరావు, మల్లెల బుల్లి బాబు, బొమ్మతోటి శామ్యూల్, డాక్టర్ చప్పిడి ప్రియతమ్ పాల్గొన్నారు. చప్పిడి వెంగళరావు, కొండమూరి ప్రకాష్, ఎ రవి, బేతాళ శరత్, జాతీయ మాల మహానాడు చీకటిపల్లి మంగరాజు, తిరె రవిదేవా, మాల సంఘాల ఐక్యవేదిక నల్లి రాజేష్, మాల మహానాడు అంబటి కొండలరావు, జై భీమ్ పీపుల్స్ జెఎసి నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

ప్రజాశక్తి - చిన్నగంజాం

18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తహశీల్దారు జె ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని కడవకుదురు, చిన్నగంజాం, రాజబంగారుపాలెం, మున్నం వారిపాలెం లను స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు విషయమై బీఎల్ఓలకు ఓటర్ల జాబితాలోని పేర్లు గ్రామస్థులకు చదివి వినిపించాలని, జాబితాలో ఒకే కుటుంబం ఓట్లు అన్నీ ఒక పోలింగ్ కేంద్రంలో ఉండాలని చెప్పారు. ఫొటోస్ సక్రమంగా లేనిచో వారిని గుర్తించి ఫొటోస్ తీసుకోవాలని, ఇంటి నెంబర్లు, తప్పులు సవరణ చేయాలని, వయస్సు కూడా సక్రమంగా వున్నది, లేనిది చూడాలని కోరారు. చనిపోయిన వారి పేర్లు తొలగించుటకు అప్లికేషన్ పెట్టించాలని కోరారు. తప్పులు లేకుండా మంచి ఓటర్ల జాబితాను తయారు చేయాలని సూచనలు ఇవ్వడమైనది. సదరు విషయంలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని తెలియజేయడమైనది

వేటపాలెం : ఓటు హక్కు లేని వాళ్ళని గుర్తించి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బిఎల్ఒలదేనని తహశీల్దారు పి పార్వతి అన్నారు. శనివారం ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా వివిధ పోలింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. 206, 207, 212, 217 పందిళ్ళపల్లి, రామన్నపేట పోలింగ్ బూతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ లిస్టులోని పేర్లను బిఎల్ఒలు ఆయా గ్రామస్తులకు చదివి అర్థం వినిపించాలని అన్నారు.



చినగంజాం తహశీల్దార్ జె ప్రభాకరరావు

18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కళ్ళకు ఓటు హక్కు పొందే విధంగా కృషి చేయాలని అన్నారు. జాబితాలో క్లారిటీ లేని ఫోటోలను మళ్లీ చేర్చాలని ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రంలో ఓట్లు ఉండే విధంగా చూడాలన్నారు. చనిపోయిన వారి ఓటర్ల పేర్లను తొలగించే విధంగా అప్లికేషన్లు పెట్టించాలని చెప్పారు. ఓటర్ల పేర్లలోని తప్పులు, ఇంటి నంబర్లతో సహా పేర్కొనాలని అన్నారు .

పర్చూరు : ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు సంభందించి స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించారు. పర్చూరు గ్రామంలో తహశీల్దారు 141, 142, 143, 144, 145, 146 నెంబర్ల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బిఎల్ఒలు, ఎంఆర్ఐ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

పంగులూరు : గ్రామంలోలో పోలింగ్ బూతులను తహశీల్దారు పి సింగారావు శనివారం పరిశీలించారు. ప్రతి ఏట ఓటర్ల మార్పులు, చేర్పులను పరిశీలించాల్సి ఉందని తెలిపారు. ఇందుకోసం శని, ఆదివారాల్లో పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పుట్టావారిపాలెంలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో విద్యుత్‌లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారంగా విద్యుత్ నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు, నాయకులు గొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సన్నెబోయిన గురు యాదవ్, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, అద్దంకి వెంకటేశ్వర్లు, సింహోతుల వీరయ్య పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండల కేంద్రమైన నిజాంపట్నంలో వేంచేసియున్న హజరత్ సయ్యద్ జైనుల్లాబ్దీన్ బాబా వలియా 74వ ఉరుసు మహోత్సవం శనివారం వైభవంగా జరుగుతున్న సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు దర్గాను సందర్శించి బాబా వలియాను దర్శించుకున్నారు.బాబా వలియా ఎంతో మహిమ గల వారని, ఉరుసు మహోత్సవం సందర్భంగా బాబా వలి యాను దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన దమయంతి, తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఒంగోలు శుభకార్యానికి రాత్రి ళుతూ దుద్దుకూరు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. దుద్దుకూరు రోడ్డుపై ఎత్తుగా వేసిన పైపులైను దాటే క్రమంలో ఒక్కసారిగా ద్విచక్ర వాహనంపై వెనుక ఉన్న దమయంతి కిందపడి తల రోడ్డుకు గుద్దుకొని దెబ్బ తగిలింది. దెబ్బ గట్టిగా తలకు తగలడంతో మహిళ మృతి చెందింది. కుమారునికి స్వల్ప గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

నవంబర్ 8 నుండి 15 వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం ప్రజా పోరుకు సిద్ధమైనట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. అధిక ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, మహిళలు, పిల్లలపై అత్యాచారాలు అరికట్టాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, జెమిలి ఎన్నికలు ఆపాలని సిపిఎం మహాసభ తీర్మానించినట్లు తెలిపారు. నెల రోజులుగా కూరగాయలు, నిత్యవసర వస్తువులు, వంట నూనె ధరల ప్రభావం కనిపిస్తుందని అన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపుకు అన్నీ చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ వాయిదా పడిందని, గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్సీ ప్రకటించలేదని, గ్రూప్ వన్, గ్రూప్ టూ అభ్యర్థులకు గోచరంగానే ఉన్నాయని అన్నారు. సిపిఎం మండల కమిటీ సమావేశం వేంపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూపై డిమాండ్ల సాధన కోసం ఈ నెల14, 15తేదీల్లో జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆంజనేయులు, సత్యం, కొండలు, రమేష్, హనుమంతరావు, ఎర్రయ్య పాల్గొన్నారు.

దళిత బాలికకు న్యాయం చేయాలి

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్
- వైసిపి నేతలను అడ్డుకున్న పోలీసులు
- బాలికను పరామర్శించిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టంగుటూరు మండలం కారుమంచి జడ్పీ స్కూలులో నాల్గో తరగతి చదువుతున్న దళిత బాలికకు న్యాయం చేయాలని మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న దళిత బాలికను మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వైసిపి నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు రిమ్స్‌లోకి వెళ్ళటాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు వైసిపి నేతలు, పోలీసులు మధ్య వాగ్వివాదం నెలకొంది. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ రిమ్స్ గేటు వద్ద


వైసిపి నేతలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బైఠాయించి నిరసన తెలియజేశారు. దీంతో ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు సంఘటనా స్థలికి చేరుకొని వైసిపి నేతలతో మాట్లాడారు. తరువాత కొద్ది మందిని బాలికను పరామర్శించేందుకు అనుమతించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, దళితులు, బిసిలు, మైనార్టీలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. శాంతి భద్రతలపై కూటమిలోని మంత్రులు విమర్శలు చేస్తున్నా హోంమంత్రి అనిత పట్టించుకోవట్లేదన్నారు. మహిళలకు రక్షణ కరువైందని, జరుగుతున్న ఘటనలపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నియోజకవర్గంలో ఘటన జరిగితే మంత్రి పట్టించుకోలేదని విమర్శించారు. దళిత బాలికకు న్యాయం చేయాలని, కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి నాయకులు వరికూటి అశోక్ బాబు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి

బాధ్యతలు చేపట్టిన జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టర్

జిల్లా ప్రజలకు వేగంగా మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున పేర్కొన్నారు. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ టి.జమున శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటి వరకు జిజిహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఫిజియాలజీ విభాగా ధిపతి డాక్టర్ జి.దుర్గాదేవి వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ టి.జమున మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత మేరకు మెరుగైన వైద్యసేవలు వేగంగా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సమయపాలన, వేగవంతమైన వైద్య సేవలే తన లక్ష్యమని తెలిపారు. వైద్యులు, అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులను సమన్వయం చేసుకొని ముందుకెళతామన్నారు. అందరి సహకారంతో జిజిహెచ్‌ను మరింత


డాక్టర్ జమునకు శుభాకాంక్షలు తెలుపుతున్న రిమ్స్ ప్రిన్సిపల్, డిప్యూటీ సూపరింటెండెంట్లు

అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు, జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ నామినేని కిరణ్, డాక్టర్ బాలాజీ నాయక్, ఆర్ఎంఒ డాక్టర్ మాధవీలత కలిసి పుష్ప గుచ్చం అందజేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను పలు విభాగాల విభాగాధిపతులు, సిబ్బంది, పరిపాలన సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బిఎల్‌ఒలు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

పోలింగ్ కేంద్రాల్లో డిఆర్‌ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బూత్ స్థాయి అధికారులు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025లో భాగంగా శనివారం పలు పోలింగ్ కేంద్రాలలో డిఆర్‌ఒ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు డిఆర్‌ఒ ఒంగోలు నియోజకవర్గం లో పలు పోలింగ్ స్టేషన్ లలో ఆకస్మిక తనిఖీ బూత్ స్థాయి అధికారులు నిర్వర్తించాల్సిన విధులపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సెయింట్ థెరిస్సా కళాశాల పోలింగ్ కేంద్రం నెంబర్ 108, 110, 111లలో బూత్ స్థాయి అధికారులు రిజిస్టర్ ను సరిగా నిర్వహించకపోవటం గమనించిన డిఆర్‌ఒ బిఎల్‌ఒలకు షోకాజ్ నోటీసు లను జారీ చేయాలని కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్‌ను ఆదేశించారు ఇటువంటి చర్యలు పునరావతం కాకుండా చూసుకోవాలని, ప్రతి నియోజకవర్గ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు నిర్దేశించారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

ఎంపీ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల ఎంపి నిధులతో జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపి టి కష్ణప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో శనివారం ఎంపి సమీక్ష జరిపారు.నియోజకవర్గాల వారీగా ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన ప్రాధాన్యతా పనుల గురించి సమీక్ష చేశారు. జిల్లాలో జరుగుతున్న అభివద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వం ద్వారా లభించే ఎంపీ ల్యాడ్స్ తో చేపట్టాల్సిన అభివద్ధి పనుల పై చర్చించి దిశా నిర్దేశం చేశారు.సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్,సిపివో శ్రీనివాసరావు, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రకాశం జిల్లా క్రీడాకారుల ఫ్లాగ్‌మార్చ్

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-భోగాపురం, (విజయనగరం జిల్లా)

స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు శనివారం విజయనగరం జిల్లా భోగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా 26 బాల బాలికల జట్లు, మూడు రోజులపాటు నిర్వహించే ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యాయి.జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈపోటీలను ప్రారంభించారు. ముందుగా జిల్లా కలెక్టర్ అంబేద్కర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఫ్లాగ్ మార్చ్ తిలకించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. పోటీలకు హాజరైన బాల బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు.

ఆగని అక్రమాలు..



రాష్ట్రంలో నూతనంగా అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లాల్లో అవినీతి, అక్రమ వ్యవహారాలు గత వైసిపి ప్రభుత్వం మాదిరే కొనసాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నేతలు ఏ తీరున అక్రమాలకు పాల్పడ్డారో ఇప్పటి ప్రభుత్వంలో కూడా అదే రీతిలో అక్రమాలను మరింతగా పెంచి పోషిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తమ పార్టీకి చెందిన నేతలు ఎవరూ కూడా అక్రమ ఇసుక అమ్మకాలు, రేషన్ బియ్యం అమ్మకాలు, మద్యం సిండికేట్ వ్యవహారాల జోలికి వెళ్లవద్దని పదేపదే చెబుతూ వచ్చారు. కానీ అధికారం అందుకున్న నాటి నుంచి ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టిన నేతలు, ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో గత పాలకుల మాదిరిగానే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తెలుగుదేశం నేతలు నేరుగా కొందరు, తమ అనుచరుల ద్వారా కొంతమేర నియోజకవర్గాల్లో లోపాయికారీ వ్యవహారాలు నడుపుతున్నారన్నది స్పష్టమవుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తెచ్చింది. మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి.పర్మినెంట్ లైసెన్స్‌లు ఇవ్వడం దాదాపు పూర్తయ్యింది. మద్యం షాపులను దక్కించుకునేందుకు దాదాపు అన్ని ప్రాంతాల్లో అధికారం అండగా సిండికేట్‌లు ఏర్పడ్డాయి.అన్ని గ్రామాల్లో గతంలో మాదిరిగానే మద్యం దుకాణాలను అనుబంధంగా బెల్ట్ షాపులు పెడుతున్నారు. ఇవన్నీ అధికారపార్టీ నేతల అండదండలతోనే సాగుతున్నాయి. కొన్ని చోట్ల నేరుగా పర్సంటేజ్‌ల పద్ధతి అమలులో ఉండగా కొన్ని చోట్ల షాపుల్లో భాగాలు తీసుకున్నారు. అధికార పార్టీ అండ లేకుండా మద్యం షాపులు నడపడం కష్టం కాబట్టి ఎక్కడయినా వ్యక్తిగతంగా షాపులు వచ్చినా వారు కూడా మద్యం కూటమిలో భాగస్వాములయ్యారు. ఎక్సైజ్ అధికారులు కూడా షరా మామూలుగా తమ నెలవారీ మామూళ్లు అడగడం మొదలుపెట్టారు. బెల్ట్ షాపులు సజావుగా సాగాలంటే అందరికి నెల మామూళ్లు ఇవ్వడం తప్పనిసరి అయ్యింది. దాదాపు మద్యం షాపుల నిర్వహణ 2019కి ముందు ఎలా ఉందో అదే తీరున సాగుతోంది.

బాపట్ల, ప్రకాశం జిల్లాలో ఎక్కడ కూడా అధికారిక ఇసుక రీచ్‌లు లేకపోవడం ఇసుక అక్రమార్కులకు వరమైంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తరలింపులకు పాల్పడిన వారు ఇప్పుడు అధికార పార్టీలో చేరిపోయారు. గడిచిన కాలమంతా ప్రతిపక్ష స్థానంలో ఉండి ఇసుకలో లాభాలను ప్రత్యక్షంగా చూసిన తెలుగు తమ్ముళ్లు వెంటనే ఇసుక అక్రమార్జనకు శ్రీకారం చుట్టారు. పార్టీ అధినేత చంద్రబాబు హెచ్చరికలు వారి చెవికెక్కలేదు. సముద్రతీరంతో పాటు కృష్ణానదీ పరివాహక ప్రాంతం అంతటా యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపులు చేపట్టారు. జెసిబిలు, టిప్పర్లతో ఇసుక తరలిపోతున్నా అధికారులు చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన బాపట్ల డిఆర్‌సి సమావేశంలో చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు కావడం లేదని మంత్రుల దష్టికి తెచ్చారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో ఇష్టం వచ్చినట్లు క్షేత్రస్థాయిలో ఇసుక కొందరు అక్రమంగా తవ్వుకొని వెళ్తున్నారని చెప్పారు. అక్రమ తవ్వకాలను అరికట్టాలన్నారు. ఇసుక తవ్వకాలకు ఏ ప్రాంతంలో అనుమతులు ఇచ్చారో స్పష్టంగా తెలపాలని కోరారు. కానీ నేటికీ ఎలాంటి చర్యలూ లేవు.

రేషన్ బియ్యం అక్రమ అమ్మకాలు కూడా యథావిధిగా కొనసాగుతున్నాయి. వ్యక్తులు మాత్రమే మారారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎలా అయితే రేషన్ బియ్యం అమ్మకాలు జరిపారో అదే తీరున సాగుతున్నాయి. అధికార మార్పిడి మాత్రమే జరిగింది. ప్రతినెలా క్రమం తప్పకుండా వచ్చే ఆదాయంగా ఉన్న రేషన్ బియ్యం దందాను అధికార పార్టీ నేతలెవరూ కూడా వదులుకునేందుకు సిద్ధపడలేదు. నెలకు ఇంత అని మామూళ్లు నిర్ణయించి మరీ దందా కొనసాగిస్తున్నారు. గతంలో రేషన్ దందా జరుపుతున్న వారిపై అప్పుడప్పుడూ అధికారులు దాడులు జరిపేవారు. ఇప్పుడు అవి కూడా లేవు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ అమ్మకాలు జరుపుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో మద్యం, ఇసుక, రేషన్ బియ్యం అమ్మకాలతో పాటు తెలుగు తమ్ముళ్లకు మరో ఆదాయ వనరు దొరికింది. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, త్రాగునీటి సౌకర్యాల పెంపుదల కోసం కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ పనులన్నీ ఎలాంటి టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో తెలుగు తమ్ముళ్ళకు అప్పజెప్పారు. ఈ పనులు ఎంతమేర నాణ్యతతో జరుగుతాయో చూడాల్సి ఉంది.

జిల్లాలోని నిజాంపట్నం మండలంలోని రాయల్ మెరైన్ సి ఫుడ్ ప్రాసెస్ సింగ్ యూనిట్‌లో కెమికల్ రియాక్షన్ కారణంగా దుర్ఘటన చోటు చేసుకుంది. అక్కడ పనిచేస్తున్న మహిళా కార్మికులు ఊపిరి తీసుకోవడం కష్టమై అస్వస్థతకు గురయ్యారు. కొందరు స్పృహ తప్పి పడిపోయారు. దాదాపు 110 మంది అస్వస్థతకు గురయ్యారు. తక్షణమే వైద్య సాయం అందడంతో ఏ ఒక్కరి ప్రాణాలకు హానీ జరగలేదు. 54 మందికి ప్రథమ చికిత్స ఇవ్వడంతో వారి ఆరోగ్యం కుదుట పడింది. 31 మందిని ఇన్ పేషెంట్లుగా చేరి చికిత్స పొందారు. నలుగురు తీవ్ర అస్వస్థతకు గురవడంతో గుంటూరు తరలించారు. ఈ ప్రమాదం పరిశ్రమల్లో కార్మికుల రక్షణ ఏర్పాట్లపై అనేక సందేహాలను లేవనెత్తింది.

బాపట్ల డిఆర్‌సి సమావేశం మొక్కుబడిగా జరిగింది. జిల్లా ఏర్పడిన రెండున్నర ఏళ్ల కాలంలో గత ప్రభుత్వ హయాంలో మూడుసార్లు మాత్రమే డిఆర్‌సి సమావేశాలు జరిగాయి. సమీక్షకు అనుగుణంగా నిధులేమీ విడుదల కాలేదు. దీంతో ఫలితం శూన్యం అయ్యింది. కొత్త ప్రభుత్వంలో మొదటిసారిగా జరిగిన డిఆర్‌సి సమావేశం కూడా గతం మాదిరే సాగింది. జిల్లా అభివృద్ధికి తీసుకోవలసిన చర్యల ఊసే లేదు. రానున్న ఆరు నెలల కాలంలో ఏమి పనులు చేపట్టాలనే విషయమై స్పష్టత లేదు. కార్యాచరణ ప్రణాళిక లేదు. గుంటూరు ఛానల్ విస్తరణ పనుల గురించి శాసనమండలి సభ్యులు కె.లక్ష్మణరావు సమావేశంలో ప్రస్తావించారు. గుంటూరు ఛానల్ విస్తరణ జరిగితే 25 వేల ఎకరాలు సాగులోకి వస్తాయి.. వైద్య కళాశాల నిర్మాణం జరగాల్సి ఉంది. ప్రధాన సమస్యలుగా ఉన్న సాగునీటి కాల్వల మరమ్మతులు, డ్రయినేజి మరమ్మతుల విషయమై తక్షణ చర్యలు లేవు. ఆయకట్టు భూములకు సాగునీరు అందించే విషయమై స్పష్టత లేదు. జిల్లా సమగ్రాభివృద్ధికి తీసుకోవలసిన చర్యల గురించి, అందుకు కావలసిన నిధుల గురించి చర్చ లేకుండా డిఆర్‌సి సమావేశం ముగిసింది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా